సాక్షి తిరుపతి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



శ్రీకృష్ణుడిగా లక్ష్మీనరసింహుడు

పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి గురువారం రాత్రి శ్రీకృష్ణుడి అలంకరణలో అలరించారు.

- 8లో



ముకుందా..మురారి!

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. రాధాగోవిందులను దర్శించి పులకించారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	26
చిత్తూరు	34	25
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

చెంగాళమ్మ సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న ఈఓ శ్రీనివాసులురెడ్డి

సూళ్లూరుపేట: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు గురువారం సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ. అల్ల శ్రీనివాసులురెడ్డి, స్థానిక జడ్జి అనూషా, తహసీల్దార్ కే.రవికుమార్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంగళవాయిద్యాలతో సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి నాల్గవ దఫా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 7నుంచి 19వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో ప్రవేశం పొందదలచిన కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న తరువాత సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

15 నుంచి జగనన్న సురక్ష

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్యాంపెయిన్ ఉంటుందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ 16 నుంచి గృహ సందర్శన అయిన కుటుంబాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్ట్‌లను 30వ తేదీ నుంచి వైద్య శిబిరంలో తెలియజేయాలని వివరించారు.

అయ్యో 'పాప'ం!



ఐసీడీఎస్ అధికారులకు చిన్నారిని అప్పగిస్తున్న రుయా సూపరింటెండెంట్

తిరుపతి తుడా: వివాహేతర సంబంధమో.. ఆడబిడ్డ పుట్టిందనో తెలియదుగానీ అభం శుభం తెలియని పసికందును గుట్టుచప్పుడు కాకుండా వదిలేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఈ ఘటన తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వెనుక నుంచి మెడికల్ కాలేజీ హాస్టల్‌కు ఉన్న మార్గంలోని కూడలి ఉంది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆ కూడలి తిన్నె మీద దాదాపు 2 నెలల వయసున్న పసికందు ఏడుపు వినిపించడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి వెళ్లారు. పసికందు వద్ద ఎవరూ లేకపోవడంతో అనుమానించారు. సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు పసికందును ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఆ పసికందును కొంతసేపు ఐసీయూలో ఉంచి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంగా ఉందని నిర్ధారించారు. తర్వాత పోలీసులతో పాటు ఐసీడీఎస్ సీడీపీఓ సుధారాణికి సమాచారం ఇచ్చారు. సిబ్బందితో వచ్చిన సీడీపీఓ ఆ పసికందును అక్కున చేర్చుకున్నారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉంది.

తండ్రి అట..పసికందును ఇవ్వాలట!

పసికందుకు తండ్రి తానేనని, తనకు ఇవ్వాలంటూ ఓ వికలాంగుడు ప్రసూతి ఆస్పత్రి అధికారులను కలవడం.. పసికందు వ్యవహారంలో కొత్త ట్విస్ట్‌కు తావిచ్చింది. తన పేరు వెంకటేష్ అని, తాటితోపులో ఉంటున్నానని చెప్పుకొచ్చాడు. దీంతో పసికందు తల్లి విషయమై అధికారులు ప్రశ్నించారు. తాము రైలులో వెళ్తుండగా తన భార్య కాలుజారి పడిపోయి చనిపోయిందని, అప్పటి నుంచి పసిబిడ్డ అనాథగా మిగిలిందని, తాను యాచిస్తూ జీవిస్తున్నానని అధికారులకు పొంతనలేని సమాధానాలు చెప్పాడు. పూర్తి ఆధారాలతో వస్తే పసికందును ఇస్తామని అతడికి తేల్చిచెప్పినట్లు ఐసీడీఎస్ అధికారులు చెప్పారు. మాతృప్రేమకు నోచుకోని ఆ పసికందు మాత్రం ఐసీడీఎస్ లాలనలో ఆదమరచి నిద్రపోయింది. ఈ పసికందు వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచిచూడాలి.

ఉద్యోగ విప్లవం

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 327కు పైగా జాబ్‌మేళాల నిర్వహణ
- 78 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన
- నేడు వెంకటగిరిలో మెగా జాబ్ మేళా
- త్వరలో ఎస్వీయూలో మరో మెగా జాబ్ మేళాకు సన్నాహాలు

సంవత్సరం	జాబ్ మేళాలు	హాజరైన అభ్యర్థులు	ఉద్యోగాలు పొందిన వారు
2019	52	12,754	8258
2020	68	15,289	10,950
2021	74	18,269	13,250
2022	95	1,32,014	38,251
2023	38	10,292	7,521



తిరుపతిలో జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

తిరుపతి సిటీ : జిల్లాలో ఉద్యోగ విప్లవం నడుస్తోంది. నిరుద్యోగ సమస్యను పూర్తిగా రూపు మాపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. నాలుగేళ్లలో సుమారు 2.5 లక్షలకు పైగా గ్రామసచివాలయాలతోపాటు ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1, గ్రూప్–2, 4 నోటిఫికేషన్లు విడుదల చేసి వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. త్వరలో మరో మారు గ్రూప్–1, 2 నోటిఫికేషన్లతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో వేల సంఖ్యలో అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. అలాగే గ్రామీణ యువతకు మండల, పట్టణ, నియోజకవర్గ కేంద్రాల్లో వందలాది జాబ్ మేళాలు నిర్వహించి వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మండల, నియోజకవర్గాలు, ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో సుమారు 327 జాబ్‌మేళాలను నిర్వహించారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి 1,88,618 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇప్పటి వరకు నిర్వహించిన జాబ్ మేళాల్లో సుమారు 78,230 వేల మంది ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. 2022లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎస్వీయూనివర్సిటీ వేదికగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రికార్డు స్థాయిలో లక్ష మందికి పైగా నిరుద్యోగులు హాజరుకాగా 28 వేల మందికి పైగా అభ్యర్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారు.

త్వరలో ఎస్వీయూలో..

గత నెలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వేదికగా ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 30 ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొని సుమారు 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఈ క్రమంలో ఈ నెల 7, 8 తేదీల్లో సుమారు 40 కంపెనీలతో ఎస్వీ యూనివర్సిటీలో మరో మెగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మరిన్ని ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొనే అవకాశం ఉంది. వచ్చే నెలలో నిర్వహించేందుకు ప్రభుత్వ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. త్వరలో తేదీలు ప్రకటించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఉద్యోగ ప్రాప్తిరస్తు

- నేడు వెంకటగిరిలో మెగా జాబ్‌మేళా
- నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. 8వ తరగతి నుంచి బీటెక్, ఎంటెక్, ఇంజినీరింగ్, పీజీ వంటి చదువులు చదువుకున్న నిరుద్యోగులు సుమారు ఆరువేల మంది హాజరుకావచ్చని అంచనా. ఈ మేరకు వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం వద్ద పటిష్ట బందోబస్తు మధ్య ఏర్పాట్లు పూర్తిచేశారు. బారికేడ్లు, చలువ పందెళ్లు, అభ్యర్థులు కూర్చోవడానికి వస తి సౌకర్యాలను సిద్ధం చేశారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగులు, వారి సహాయకులకు వేర్వేరుగా భోజన వసతి సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేళాలో 49 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇప్పటికే 4వేల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.



ఎస్‌జీఆర్ భవనం వద్ద ఇంటర్వ్యూలకు ఏర్పాటు చేసిన క్యాబిన్‌లు



భోజన వసతి కోసం శుభ్రం చేస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

> **ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశం**
>
> వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో ప్రతి నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించడమే నా ధ్యేయం. గడప గడప కార్యక్రమంలో నా దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని నిర్ణయించా. అందుకే మేగా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నా. ఇప్పటికే కొందరు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి కూడా అవకాశం కల్పించాం. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.
>
> – నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

శ్రీనివాస సేతుకు తుదిమెరుగులు

- 18న సీఎం చేతులు మీదుగా ప్రారంభానికి విస్తృత ఏర్పాట్లు
- స్మార్ట్ సిటీ ఎండీ హరిత



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ కార్పొరేషన్, తిరుమల– తిరుపతి దేవస్థానం సంయుక్త భాగస్వామ్యంతో నిర్మిస్తున్న శ్రీనివాస సేతు తుది మెరుగులు దిద్దుకుంటుందని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డీ.హరిత పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఇంజినీర్లతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా చిన్నపాటి లోపం లేకుండా పెద్ద ఎత్తున ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని చెప్పారు. ప్రెస్ట్రెస్సింగ్ పనులను ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాససేతును ప్రారంభించనున్నట్టు చెప్పారు. పనులు పూర్తి కావడంతో అదే రోజు నుంచి ప్రజలకు ఫ్లైఓవర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఇందుకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15వ తేదీ కల్లా అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. చివరి రెండు రోజుల్లో ఫ్లైఓవర్ సుందరీకరణ పనులు చేపడతామన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.650 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ని నిర్మించామన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి మణిహారం వినాయకసాగర్

- రూ.20 కోట్లతో అభివృద్ధి
- వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



వినాయక సాగర్ వద్ద టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీషా, డెప్యూటీ మేయర్లు, స్మార్ట్ సిటీ ఎండీ

తిరుపతి మంగళం : తిరుపతి నగరానికే మణిహారంలా వినాయకసాగర్ నిలుస్తుందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.20 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో అభివృద్ధి చేసిన వినాయకసాగర్‌ను గురువారం ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ వినాయకసాగర్ ఒకప్పుడు లింగాలమ్మచెరువు పేరుతో ఈ ప్రాంత రైతులపాలిట కల్పతరువుగా ఉండేదని గుర్తుచేశారు. ఆ తర్వాత సరైన కాలువలు లేకపోవడంతో డ్రైనేజీగా మారి పోయిందన్నారు. ఆ లింగాలమ్మ చెరువును రూ.20 కోట్లతో ఆధునీకరించి వినాయకసాగర్ పేరు పెట్టినట్టు తెలిపారు. ఆహ్లాదకరవాతావరణంలో ఈ చెరువు తిరుపతికే మణిహారంలా నిలుస్తుందన్నారు. వినాయక నిమజ్జన కమిటీ కోరిక మేరకు వినాయకసాగర్ మధ్యలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం వేళల్లో నగర ప్రజలు సేదతీరడానికి అనువుగా వినాయకసాగర్ వద్ద అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు.

పరుగులుపెడుతున్న అభివృద్ధి

తిరుపతి నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీ గురుమూర్తి కొనియాడారు. వినాయకసాగర్‌ను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. వినాయకచవితి వేడుకల వేదికగా వినాయకసాగర్‌ను అభివృద్ధి చేయడంలో కరుణాకరన్న కృషి దాగి ఉందన్నారు. అనంతరం మేయర్ శిరీషా మాట్లాడుతూ వినాయకసాగర్‌ను త్వరగా పూర్తిచేయాలన్న ఉద్దేశంతో కార్పొరేషన్ జనరల్ నిధుల నుంచి రూ.1.75కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్‌కుమార్, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, తిరుపతి మునిరామిరెడ్డి, ఆరణి సంధ్య, కోటేశ్వరమ్మ, దూది కుమారి, సీకే.రేవతి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ ఇమామ్, శ్రీదేవి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, పోలిరెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు ఆదం సుధాకర్‌రెడ్డి, సునీల్‌చక్రవర్తి, తాలూరి ప్రసాద్, రాజేంద్ర, ఎస్ఈ మోహన్, చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




ఉట్లోత్సవాన్ని తిలకిస్తున్న ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఉట్లోత్సవం ఉల్లాసభరితంగా సాగింది. ముందుగా స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు ఉట్టి కట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో వేద పాఠశాల పిల్లలతో పాటు గ్రామానికి చెందిన యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి ఏడాదీ కృష్ణాష్టమికి ఆలయం వద్ద ఉట్లోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సందడే.. సందడి

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన ఉట్లోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడగా ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారిని ప్రోత్సహిస్తూ సందడి చేశారు. సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి, ఆలయాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉట్టికొడుతున్న యువత

దొంగ ఓట్లు తొలగించాల్సిందే

- 2019లో టీడీపీ దొంగ ఓట్లు చేర్చినా 43 వేల మెజారిటీ సాధించాం
- నకిలీ ఓట్లను ఎవరు దరఖాస్తు చేసినా తిరస్కరించండి
- కలెక్టర్‌కు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజ్ఞప్తి



సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వివిధ పార్టీల నేతలు

తిరుపతి అర్బన్: 'చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాల్సిందే.. మాకు ప్రజాబలం ఉంది.. ప్రజలు మమ్మల్ని తమ కుటుంబ సభ్యులుగా భావించి ఆదరిస్తున్నారు.. చిత్తూరు పరిసర ప్రాంతాల నుంచి అత్యధికంగా కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తులు వచ్చినట్టు మాకు సమాచారం ఉంది.. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి.. చంద్రగిరి నియోజకవర్గంలో నిజమైన ఓటరుకు అన్యాయం జరగకుండా చూడాలి.. గత ఎన్నికల్లో దొంగ ఓట్లతో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడితే రీపోలింగ్ పెట్టించాల్సి వచ్చింది.. ఆ పరిస్థితి రాకుండా చూడాలి. దొంగ ఓట్లు ఎవరు చేర్చినా నిర్దాక్షిణ్యంగా తొలగించాలి' అంటూ వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన రాజకీయ పార్టీల సమావేశానికి హాజరైన మోహిత్ రెడ్డి దొంగ ఓట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు.

టీడీపీ దొంగ ఓట్లు ఎక్కించినా.. 43వేలు మెజారిటీ సాధించాం

గత ఎన్నికలకు ముందు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా కుప్పలు తెప్పలుగా దొంగ ఓట్లను ఎక్కించుకుని తుది జాబితాను విడుదల చేసిందని మోహిత్ రెడ్డి అన్నారు. వాళ్లు తయారు చేసుకున్న దొంగ ఓట్ల జాబితా అమలులో ఉన్నప్పటికీ తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 43వేల ఓట్ల మెజారిటీ సాధించారని, చంద్రగిరి ప్రజలు తమను ఎంతగా అభిమానిస్తున్నారో దాన్ని బట్టే అర్థమవుతుందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు ఎక్కడా అవకాశం లేకుండా చూడాలన్నారు. ఈమేరకు స్పందించిన జిల్లా ఎన్నికల అధికారి వెంకటరమణారెడ్డి దొంగ ఓట్ల పట్ల కఠినంగా వ్యవహరించి అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాతనే తుది జాబితాను తయారుచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్: 'బిడ్డల భవిష్యత్ కోసం.. విద్య, ఆరోగ్యం మరింత మెరుగుపడడం కోసం సీఎం జగనన్న మరోసారి అధికారంలోకి తీసుకొద్దాం' అని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని మిట్టాత్మకూరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.19 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీటీసీ ఊటుకూరు యామినితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ మన భవిష్యత్తును డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారని, అదే అంశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు వస్తే అప్రజాస్వామ్యం రాజ్యమేలుతుందని చెప్పారు. వైస్ ఎంపీపీ ఎం.శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ యల్లా మమతమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


చోరీ చేసిన సొత్తుతో పాటు నిందితులను చూపుతున్న డీఎస్పీ, తదితరులు

చిల్లకూరు: రెండు ప్రాంతాలలో వేర్వేరుగా విద్యుత్ తీగలలను చోరీ చేసిన నిందితులను పట్టుకుని, వారి నుంచి సుమారు రూ 4.15 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడూరు రూరల్ పరిధిలోని శారదానగర్ గిరిజన కాలనీకి చెందిన వెందోటి కృష్ణ, అములూరు శివమణి, నాగముంతల చెంచయ్య, అద్దూరు పుల్లయ్య చిల్లకూరు మండలం , కడివేడు రెవెన్యూ పరిధిలోని కల్పతరువు అల్లాయస్ అనే పరిశ్రమలో రాగి తీగలు ఉన్న సుమారు 8 వేల మీటర్ల విద్యుత్ తీగలను, అలాగే పెంటపాడు రెవెన్యూ పరిధిలోని రొయ్యల చెరువుల వద్ద ఉన్న 600 కేబుల్ వైర్లను గత నెలలో చోరీ చేశారన్నారు. అప్పటి నుంచి వారు తప్పించుకు తిరుగుతుండగా.. చోరీ చేసిన సొత్తును విక్రయంచుకునేందుకు పోటుపాళెం రోడ్డులో వేచి ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సీఐ దశరథరామారావుతో పాటు, ఎస్ఐ గోపాల్, ఏఎస్ఐ సిరాజ్, ఆర్ వీ రాజు, నావూరయ్య, సుబ్రహ్మణ్యం, కస్తూరయ్య, వెంకటేశ్వర్లు, విష్ణుకుమార్ చాకచక్యంగా నిందితులను పట్టుకున్నట్టు వెల్లడించారు.

ఉదయనిధి స్టాలిన్‌ను బర్తరఫ్ చేయాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే

తిరుపతి సిటీ : తమిళనాడు క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే డిమాండ్ చేశారు. ఆయన గురువారం జాతీయ సంస్కృత వర్సిటీలో మీడియాతో మాట్లాడారు. దేశంలో మెజారిటీ హిందూ ప్రజలు పాటిస్తున్న సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ విచక్షణా రహితంగా మాట్లాడడం దారుణమన్నారు. ఆయనపై సుమోటుగా కేసు నమోదు చేయాలని సుప్రీం కోర్టుకు విన్నవించారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 14 వరకు దేశవ్యాప్తంగా శౌర్య జాగరణ యాత్ర నిర్వహించి యువకులను దేశ రక్షణ, దేశభక్తి పట్ల చైతన్యవంతులను చేస్తామన్నారు.

ముకుందా..మురారి!


ఇస్కాన్ మందిరంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఇస్కాన్ ప్రతినిధులు

- కన్నుల పండుగగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు
- భక్తజనంతో పులకించిన ఇస్కాన్ మందిరం

తిరుపతి కల్చరల్: లోకరక్షకుడై జగన్నాథుడుగా భక్త జనావళి పూజలందుకుంటున్న శ్రీకృష్ణ భగవానుని జన్మాష్టమి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. ఇస్కాన్ మందిరాలు, కృష్ణ మందిరాలలో శ్రీరాధాగోవిందులను భక్తజనం భక్తితో దర్శించి పులకించారు. ఇందులో భాగంగా తిరుపతి నగరంలో వెలసిన ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జపంతో వేడుకలు ఆరంభమయ్యాయి. శ్రీరాధాగోవిందులతో పాటు అష్టసఖులను విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తండోపతండాలుగా ఇస్కాన్ మందిరానికి తరలి వచ్చి శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు.

ఉట్లోత్సాహం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరం ఎదురుగానున్న టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. యువత రంగునీటి జలకాల నడుమ ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఉట్టి కొట్టిన యువతకు బహుమతి అందజేశారు.


టీటీడీ మైదానంలో ఉట్టికొడుతున్న యువత

వేడుకగా మహా శంఖాభిషేకం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో గురువారం రాత్రి 11 గంటలకు శ్రీరాధాగోవిందుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

సాహివాల్ గోసంతతి అభివృద్ధికి కృషి

తిరుపతి రూరల్: దేశీయ గోవుల్లో అధిక ప్రాధాన్యత కలిగిన సాహివాల్ గోసంతతి అభివృద్ధి కేంద్రంగా టీటీడీ గోసంరక్షణ శాలను తీర్చిదిద్దనున్నట్టు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. సాహివాల్ గోసంతతి అభివృద్ధి కోసం రూ.40 కోట్ల నిధులను గ్రాంట్‌గా కేంద్రం మంజూరు చేసినట్లు తెలిపారు. గోకులాష్టమి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి–గోపూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలిపిరి వద్ద గల సప్తగోప్రదక్షిణ మందిరంలో వేణుగోపాల స్వామి వారికి విశేషంగా అభిషేకం చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గోవు హిందువులకు తల్లి లాంటిదని, భగవంతునితో సమానంగా పూజలు చేస్తారని, అలాంటి గోవును సంరక్షించుకోవాల్సిన బాధ్యత భారతీయులందరిపైనా ఉందన్నారు. అవసరమైన రైతులకు గోవులను దానంగా ఇస్తున్నట్టు చెప్పారు.


గోశాలలో గోవును పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

రాధాగోవిందులను దర్శించుకున్న టీటీడీ చైర్మన్

టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇస్కాన్ మందిరంలోని శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు. వీరికి ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు, ప్రతినిధులు సాదర స్వాగతం పలికి శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించి ప్రసాదాలు వితరణ చేశారు. అలాగే ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డీ.హరిత, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినాయ్‌రెడ్డి శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు.


గోవుకు మేత తినిపిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమలు

టీటీడీ చైర్మన్‌కు కళాకారులు ఘన స్వాగతం పలికారు. గజరాజులకు చెరుకు, పండ్లు అందించిన అనంతరం శ్రీ వేణుగోపాల స్వామివారిని చైర్మన్ దర్శించుకున్నారు. అక్కడి నుంచి గోమందిరానికి చేరుకుని, గోవు, దూడకు శాస్త్రబద్ధంగా పూజలు నిర్వహించి పూల దండలు వేసి, నూతన వస్త్రాలు సమర్పించారు. దాణా, మేత తినిపించి పాలు సేకరించారు. అనంతరం గోసంరక్షణశాలలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర దివ్య మహా మంత్ర యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తరువాత శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపం పుస్తకాలను స్థూపంలో సమర్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్వీ గో సంరక్షణ కమిటీ సభ్యులు రామ్ సునీల్‌రెడ్డి, సీవీఎస్ఓ నరసింహ కిషోర్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

తిరుపతి కల్చరల్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న ఎస్‌కేడీ నగర్, న్యూబాలాజీ కాలనీలోని మేక్‌మై బేబి జీనియస్ స్కూల్లో తిరుపతి జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కైలాష్‌సింగ్ రాజపురోహిత్ తెలిపారు. ఈమేరకు గురువారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు ఐదు విభాగాలుగా చేపడుతున్నామన్నారు. 9 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికల విభాగం సబ్ జూనియర్స్, 14 నుంచి 18 ఏళ్లలోపు జూనియర్స్ బాల, బాలికల విభాగం, 18 నుంచి 28 ఏళ్లలోపు సీనియర్స్‌ఏలో స్త్రీ, పురుషుల విభాగం, 35 నుంచి 45 ఏళ్ల లోపు సీనియర్స్ -బీలో సీనియర్స్ విభాగం , 45 నుంచి 55 ఏళ్ల వయస్సులోపు సీనియర్స్–సీ విభాగం చొప్పున పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే మాస్టర్స్ కేటగిరిలో 28 నుంచి 35 ఏళ్లలోపు, 36 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు గల యోగా మాస్టర్స్‌కి కూడా పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనదలిచిన వారు ఆన్‌లైన్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, లేదా పోటీలు జరిగే స్థలంలో కూడా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9490420720, 9985394350, 9177707096లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలెక్షన్స్


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బహుళజాతి సంస్థ ఫ్లోసర్వ్ గురువారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించింది. మెకానికల్ విభాగం నుంచి నలుగురు విద్యార్థులు రూ.6.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సుభాష్, ప్రసాద్, ప్రశాంత్, చేతన్‌సాయిని ఆయన అభినందించారు.

శ్రీకృష్ణుడిగా లక్ష్మీనరసింహుడు


శేష వాహనంపై శ్రీకృష్ణుడి అలంకరణలో ఊరేగుతున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి గురువారం రాత్రి శ్రీకృష్ణుడి అలంకరణలో అలరించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని అలంకార మండపంలో శేషవాహనంపై పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవతలను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి మేళతాళాల నడుమ కోన వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న మోహిత్ రెడ్డి

- పత్రికా విలేకరి మరణంతో విషాదం
- రూ.లక్ష ఆర్థిక సాయం


సీనియర్ పాత్రికేయుడు నాదముని యాదవ్ అన్న కుమారుడు చిట్టిబాబు యాదవ్‌ను ఓదార్చుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ, పనపాకం పేటకు చెందిన పవిత్రా విలేకరి ఆవుల నాదముని యాదవ్(62) మృతి స్థానికంగా విషాదాన్ని నింపింది. పాతికేళ్లుగా వివిధ దినపత్రికల్లో విలేకరిగా విధులు నిర్వహించారు. చంద్రగిరి మండల పరిధిలో సుదీర్ఘ కాలంగా పత్రికా రంగంలో పనిచేసిన ఆయన బుధవారం ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలిసిన వెంటనే తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పనపాకంపేటకు చేరుకుని మృతుని కుటుంబాన్ని ఓదార్చారు. నాదముని యాదవ్ మృతి తీరనిలోటని సంతాపం వ్యక్తం చేశారు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని భావించిన మోహిత్‌రెడ్డి వ్యక్తిగతంగా లక్ష రూపాయలు అందించి ఆదుకున్నారు. మానవత్వం చాటిన మోహిత్ రెడ్డి సేవా గుణాన్ని పలువురు శ్లాఘించారు. పత్రికారంగంలో పనిచేసే వారికి అధిక ఒత్తిడి, ఆలోచనల కారణంగా ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని మోహిత్‌రెడ్డి సూచించారు.

'జగనన్నకు చెబుదాం' పదండి!


కలెక్టరేట్‌లో అర్జీలు ఇస్తున్న లబ్ధిదారులు(ఫైల్)


ఆధార్ క్యాంపుల్లో తప్పులను సవరించుకుంటూ..(ఫైల్)

- నేడు చిట్టమూరు మండలంలో ప్రారంభం
- 2024 జనవరి 5 వరకు కొనసాగింపు
- ప్రతి బుధ, శుక్రవారాలు మండల కేంద్రాల్లో
- ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో

తిరుపతి అర్బన్: ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వంద శాతం మేర సమస్యలు పరిష్కరించాలని వినూత్న పథకాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అనివార్య కారణాల వల్ల అర్హులుగా ఉండి.. ప్రభుత్వ పథకాలు అందని వారి కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో మరో మారు 34 మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. మొదటిగా శుక్రవారం గూడూరు నియోజకవర్గం చిట్టమూరు మండలం నుంచి ప్రారంభించనున్నట్టు యంత్రాంగం పేర్కొంది.


ఈ ఏడాది మేలో..

ఈ ఏడాది మే 9వ తేదీ నుంచి సెప్టెంబర్ 6 వరకు జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో 6,001 అర్జీలు రాగా అందులో 5,055 అర్జీలను పరిష్కరించారు. కలెక్టర్ నేతృత్వంలో మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారాలు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇక ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు.

ఏరోజు ఏ మండలంలో అంటే

ఈనెల 8న చిట్టమూరు, 13 పుత్తూరు, 15 సూళ్లూరుపేట, 20 శ్రీకాళహస్తి, 22 సత్యవేడు, 27 గూడూరు, 29 చంద్రగిరి, అక్టోబర్ 4 రేణిగుంట, 6 వాకాడు, 11 నాయుడుపేట, 13 పాకాల, 18 నాగలాపురం, 20 డక్కిలి, 25 తడ, 27 ఏర్పేడు, నవంబర్ 3 చిన్నగొట్టిగల్లు, 8 కోట, 10 వడమాలపేట, 15 వరదయ్యపాళెం, 17 రామచంద్రాపురం, 22 వెంకటగిరి, 24 తొట్టంబేడు, 29 దొరవారిసత్రం, డిసెంబర్ 01 యర్రావారిపాళెం, 6 చిల్లకూరు, 8 పిచ్చాటూరు, 13 ఓజిలి, 15 బాలాయపల్లి, 20 నారాయణవనం, 22 పెళ్లకూరు, 27 కేవీబీ పురం, 29 బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3(2024) తిరుపతి అర్బన్, 5 తిరుపతి రూరల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆ సంకల్పంతోనే..



ప్రభుత్వం వంద శాతం న్యాయం చేయాలనే సంకల్పంతోనే స్పందనతోపాటు జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, ఆధార్ క్యాంపులు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అర్హత ఉంటే చాలు.. వారికి తప్పకుండా ప్రభుత్వ పథకాలు అందాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. ఆదిశగా చర్యలు చేపడుతున్నాం.

–కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా